క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ధర్మవరం బాలిక ఎంపిక



క్రీడాకారిణిని అభినందిస్తున్న జయచంద్రారెడ్డి, అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ధర్మవరం బాలిక ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం బాలికను అభినందించారు. ఈనెల 14 నుంచి 19 వరకు తమిళనాడు చెన్నైలో జరిగే అండర్–17 బాలికల ఎస్‌జీఎఫ్ నేషనల్ గేమ్స్‌లో ఏపీ జట్టు తరఫున పట్టణానికి చెందిన కిరణ్మయి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జాతీయస్థాయిలో కూడా రాణించి మంచి పేరు తీసుకురావాలని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ ఆకాంక్షించారు.

బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి స్పేస్ కళాశాలలో శనివారం గత నెల 24న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోయిన్‌ఖాన్ అనే విద్యార్థికి బాయ్స్ హైస్కూల్ 1980 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, మానసధార సేవా సంస్థ అండగా నిలిచారు. పూర్వ విద్యార్థులు రూ.90 వేలు, మానసధార సేవా సంస్థ నిర్వాహకులు ఎంఎస్ ప్రశాంత్ రూ.28 వేలను శనివారం విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు క్రిష్ణమూర్తి,ఖాజాపీర్, రాజారెడ్డి, మైనోద్దీన్, అమరనాథ్,రామాంజి, లక్ష్మీనారాయణ,నిజాం, బాబూరావు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను విడుదల చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ రచించిన మూడు పుస్తకాలను విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ షఫీ శనివారం ఆవిష్కరించారు. రాంభూపాల్ ప్రజల ఐక్యతను దెబ్బతీసే విద్వేష రాజకీయాలు, అసమానతలు, ఆర్థిక విధానాలు, రైతులను ముంచుతున్న పాలకుల విధానాలు అనే మూడు పుస్తకాలను రచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ సామాజిక విషయాలను సులభంగా అర్థమయ్యే రీతిలో రాయడం అభినందనీయమన్నారు. సీపీఎం నాయకులు జగన్మోహన్, బాబ్జాన్, ముస్తక్, రామ్మోహన్, ఫాజిల్, రఫి, ఉదయ్, నారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

పేద కళాకారులకు దుప్పట్ల పంపిణీ

ధర్మవరం రూరల్: సుబ్బరావుపేట ఎస్సీ కాలనీలోని పేద కళాకారులకు శనివారం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామం వచ్చిన ఆయన గ్రామంలోని పేద కళాకారులకు చలికాలం కావడంతో దుప్పట్లను అందజేశారు ఉపాధ్యాయుడు అంజినప్ప పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి యువకుడి మృతి

కదిరి టౌన్: అతిగా మద్యం తాగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. కదిరిలోని హిందూపురం రోడ్డు చెక్‌పోస్టు సమీపంలో ఓ వ్యక్తి విగతజీవిగా పడి ఉండటం గమనించిన ఓ వ్యక్తి శనివారం పోలీసులకు సమాచారమందించారు. మూడు రోజుల క్రితమే సదరు వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతుడు కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి తాలూకా శేషనేపల్లికి చెందిన నవీన్‌కుమార్(25)గా గుర్తించారు.

సంక్రాంతి సంబరాలు



సినీ గీతాలకు స్టెప్పులు వేస్తున్న విద్యార్థినులు

పుట్టపర్తి అర్బన్: పట్టణ సమీపంలోని సంస్కృతీ విద్యాసంస్థల్లో శనివారం సంక్రాంతి సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు డ్యాన్సులు అలరించారు. విద్యార్థినులు ముగ్గుల అందమైన ముగ్గులు వేయడంతోపాటు అక్కడే పొంగలి తయారు చేశారు.

గాండ్లపెంట: మలమీదపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు.



గుంజువారిపల్లిలో ఆగిపోయిన గ్రామ సచివాలయ భవనం



తనకల్లులో పూర్తికాని సచివాలయ భవనం

సచివాలయాలకు గ్రహణం

- అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలు
- దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కదిరి నియోజకవర్గంలో సచివాలయ భవన నిర్మాణాలు ఇలా..

మండలం	మొత్తం భవనాలు	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
కదిరి	12	7	5
తనకల్లు	14	4	10
తలుపుల	13	10	3
ఎన్‌పీకుంట	10	9	1
నల్లచెరువు	10	3	7
గాండ్లపెంట	7	6	1

తనకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పలు సేవలను అందించారు. సచివాలయ భవనాలకు నిధులను కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో కొన్ని భవనాల నిర్మాణం నిలిచిపోయింది. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. దీంతో సచివాలయాల భవనాలు పూర్తయి సేవలు అందుబాటులోకి వస్తాయో– రావో తెలియని సందిగ్ధంలో ప్రజలున్నారు. సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కూటమి పాలకులు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

భవన నిర్మాణాలపై నిర్లక్ష్యం

సచివాలయ భవన నిర్మాణాలపై పాలకులు, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అన్ని హంగులతోపాటు పరిపాలన సౌలభ్యం కోసం ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.40 లక్షల దాకా కేటాయించింది. కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో 66 సచివాలయ భవనాలకు గాను 39 భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన 27 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. సచివాలయాలు అందుబాటులోకి వస్తే గ్రామంలోనే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సచివాలయ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవనాలను పూర్తి చేయాలి



మా గ్రామంలో సచివాలయ భవనాన్ని గోడల వరకు నిర్మించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వెంటనే ఆగిపోయిన భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. ప్రజలకు ప్రభుత్వ సేవలను గ్రామాల్లోనే అందించాలి.

– రెడ్డెప్ప, గందోడివారిపల్లి, తనకల్లు

సేవలు అందుబాటులోకి తేవాలి



గత ప్రభుత్వం మంచి ఉద్దేశంతో గ్రామ సచివాలయం వ్యవస్థను తీసుకొచ్చింది. మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే ఉన్న గ్రామంలోనే ప్రభుత్వ సేవలను పొందొచ్చు. ప్రభుత్వం ఆగిపోయిన భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సచివాలయ సేవలను అందుబాటులోకి తీసుకురావాలి.

– శివన్న, బత్తినవారిపల్లి, తనకల్లు

‘మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవతోనే న్యాయం’



మాట్లాడుతున్న ఎస్సీ కాలనీవాసులు

తాడిమర్రి: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చొరవతోనే తమకు న్యాయం జరిగిందని, హైకోర్టు ఆదేశాలతోనే భారీ నీటిపారుదల శాఖ అధికారులు తమ బ్యాంక్ ఖాతాల్లో రూ.10 లక్షలు జమ చేశారని మర్రి మాకులపల్లి ఎస్సీ కాలనీ వాసులు పేర్కొన్నారు. శనివారం కాలనీ వాసులు చిగుళ్లరేవు ఆదినారాయణ, చిగుళ్లరేవు భాగ్యమ్మ, చిగుళ్లరేవు దావీదు విలేకరులతో మాట్లాడారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో తమ గ్రామం ముంపునకు గురైందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామస్తులకు కుటుంబానికి రూ.10 లక్షల ప్రకారం నష్ట పరిహారం అందించిందన్నారు. అయితే ఎస్సీ కాలనీకి చెందిన 98 మందికి రూ.7 లక్షలు మాత్రమే మంజూరైందన్నారు. దీంతో తాము ఎంపీటీసీ సభ్యురాలు మేదిరెడ్డి వనిత, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డికి సమస్యను తెలపగా వారు వెంటనే అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి సమస్యను వివరించారు. దీంతో ఆయన బాధితులకు ముంపు పరిహారం అందించడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. చివరకు ఆయన 98 మంది తరఫున గత ప్రభుత్వంలోనే హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టులో (కంటెంప్ట్ కేస్ నంబర్ సీసీ 3323 ఆఫ్ 2024) ఇటీవల జరిగిన వాయిదాలో భారీ నీటిపారుదల శాఖ అధికారులకు హైకోర్టు ప్రత్యేక ఆదేశాలు జారి చేసిందన్నారు. సంక్రాంతిలోగా బాధితులకు రూ.10 లక్షలు వారి ఖాతాలో జమ చేయకపోతే ఫార్మ్ 1 ప్రకారం జైలుకు పంపుతామని అధికారులకు హెచ్చరించారన్నారు. దీంతో అధికారులు వెంటనే పరిహారం మా ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇది సహించని కూటమి పార్టీల నాయకులు తమలోని కొందరికి ప్రలోభాలకు గురి చేసిన వ్యక్తులు మంత్రులు సత్యకుమార్, పవన్ కళ్యాణ్ వల్లే పరిహారం మంజూరైందని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. నిజంగా వారి ప్రయత్నంతోనే నష్ట పరిహారం మంజూరై ఉంటే గ్రామంలో పరిహారం అందని 115 మంది బాధితులకు అందాలి కదాని ప్రశ్నించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తాం



ప్రణీత్‌రెడ్డిని అభినందిస్తున్న నాయకులు

కదిరి: ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌రెడ్డి పేర్కొన్నారు. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని పేర్కొన్నారు. ఇదే క్రమంలో శనివారం ఆయన జన్మదినం కావడంతో మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా తమ నియామకంపై పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బైక్ భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మహబూబ్ బాషా అలియాస్ వేమల ఫయాజ్, ఆర్గనైజేషనల్ సెక్రెటరీలు ఆంజనేయరెడ్డి, ఈశ్వరయ్య, యాక్టివిటీ సెక్రెటరీలుగా ఎంపికైన చెన్నక్రిష్ణారెడ్డి, నాగరాజు శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

దాడి ఘటనపై విచారణ

తనకల్లు: దిగువ బత్తినవారిపల్లిలో ఇటీవల దళిత మహిళలపై జరిగిన దాడి ఘటనపై డీఎస్పీ శివనారాయణస్వామి శనివారం విచారణ చేశారు. బాధితులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెండు వర్గాల మధ్య నెలకొన్న రస్తా వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు సూచించారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



ధర్మవరంలో ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ధర్మవరం: పట్టణంలోని కాలేజిసర్కిల్ వద్ద శనివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ వేలమందిని వీరులుగా తయారు చేసి ఒక గొప్ప దళంగా తీర్చిదిద్దిన యోధులు రేనాటి వీరుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు.

బత్తలపల్లి: రేనాటి వీరుడు, తొలి స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర సంఘం నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఘనంగా నిర్వహించారు. శనివారం బత్తలపల్లి కూడలిలో వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నారికేళాలను సమర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలందరికీ పంచి పెట్టారు. ఎంపీడీఓ నరసింహ నాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏఓ శ్రీనివాసులు, తహసీల్దార్ స్వర్ణలత, సీఎస్‌డీటీ రామక్రిష్ణ, వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఎంపీపీ రమణారెడ్డి తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథగుప్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్ఓ నీలకంఠరెడ్డి పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ వెంకట రంగారావు ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోఆర్డీ విజయ్‌శేఖర్ నాయుడు, ఆత్మకూరు సర్పంచ్ శెట్టిపల్లి వెంకటనారాయణరెడ్డి, బీజేపీ నాయకులు దేవర రామ్మోహన్, వడ్డెర యువకులు కండక్టర్ చలపతి, బల్లో హనుమంతు, బాబు, లక్ష్మన్న, హరినాథ్, రమణయ్య, ప్రసాద్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కదిరి టౌన్: వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా బీఎస్పీ నాయకులు శనివారం పట్టణంలోని వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇర్ఫాన్, నాయకుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీ కుంట: ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం స్థానిక బస్టాండు కూడలి వద్ద వడ్డెర సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డెర సంఘం నాయకులు దేరంగుల ఆది, కేతన వెంకటపతి, నెంబర్ వెంకటేష్, కేతన ప్రభాకర్, ఆంజనేయులు, గోగుల లక్ష్మినారాయణ, మంజుల రమణ, దేరంగుల నరేంద్ర, పెద్దన్న పాల్గొన్నారు.

ఓడీచెరువు: వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయాల్లో శనివారం అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను, వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం



మాసపల్లి సాయికుమార్ | మాదిరెడ్డి జయరామిరెడ్డి | కోటి సురేష్‌కుమార్ | గుర్రం శ్రీనివాసరెడ్డి | మధుసూదన్ నాయుడు



చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి | రామచంద్రా రెడ్డి | మీనుగ నాగరాజు | కర్రా హనుమంతరెడ్డి

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తామని నూతనంగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులపైన మాసపల్లి సాయికుమార్ పేర్కొన్నారు. తనను నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు, తన ఎంపికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు శనివారం ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని ఆ పార్టీ ఆర్గనైజషనల్ సెక్రటరీ చిగిచెర్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కమిటీలో స్థానం కల్పించడం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో మండల వాసులకు ప్రాధాన్యత లభించింది. లింగారెడ్డిపల్లికి చెందిన గుర్రం శ్రీనివాసరెడ్డిని జిల్లా అధికార ప్రతినిధిగా, మండల కేంద్రానికి చెందిన కోటి సురేష్‌కుమార్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన మాదిరెడ్డి జయరామిరెడ్డిని మండల కన్వీనర్‌గా నియమించారు. తమపై నమ్మకంతో నియమించిన రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఓడీచెరువు: వెఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన మధుసూదన్‌నాయుడు పేర్కొన్నారు. తన నియమాకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి శనివారం ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా మధుసూదన్‌నాయుడు నియామకంపై మండల కన్వీనర్ రాజునాయుడు హర్షం వ్యక్తం చేశారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇద్దరికి జిల్లా స్థాయిలో, ఒకరికి మండల స్థాయి పదవులు దక్కాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా సానే రాజశేఖరరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెట్రీగా న్యామద్దెలకు చెందిన రామకృష్ణారెడ్డి, చెన్నేకొత్తపల్లి మండల కన్వీనర్‌గా డోలా రామచంద్రారెడ్డిని నియమించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

రామగిరి: వైఎస్సార్‌సీపీ రామగిరి మండల కన్వీనర్‌గా మీనుగ నాగరాజును పార్టీ అధిష్టానం నియమించింది. కర్రా హనుమంతరెడ్డిని జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతామని నాయకులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

ధర్మవరం: క్రీడలతో మానసిక ఉల్లాసమని లభిస్తుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వాసుదేవ తెలిపారు. పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వాసుదేవ మాట్లాడుతూ స్వామి వివేకానంద యువత అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. ఏబీవీపీ ఆయన అడుగుజాడల్లో నడుస్తోందన్నారు. అనంతరం కబడ్డీ పోటీ విజేతలకు బహుమతులు అందించారు. ఏబీవీపా నగర కార్యదర్శి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి గిరి, నాయకులు హరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి టౌన్: అదనపు కట్నం కోసం వేధించిన వ్యక్తితోపాటు అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపిన వివరాలు..కుటాగుళ్ల గ్రామానికి చెందిన మద్దెల వినీత తలుపుల మండలంలో ఎంపీఈఓ గా పనిచేస్తోంది. ఈమెకు గతేడాది ఆగష్టులో కడప జిల్లా పులివెందుల నివాసి అయిన వెలవలి సుధీర్‌తో వివాహం జరిగింది. అప్పట్లో వరకట్నంగా 10 తులాల బంగారు, రూ.2 లక్షల నగదు ఇచ్చారు. పెళ్లి తర్వాత అందంగా లేవని, నీతో కాపురం చేయాలంటే రూ.20 లక్షలు కట్నం తీసుకురావాలంటూ భర్తతోపాటు అత్త, మామ, ఆడపడుచు శారీరకంగా, మానసికంగా వేధించేవారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలిపై యువకుడి దాడి

కదిరి టౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో గునివాండ్ల గంగులమ్మ అనే వృద్ధురాలు ఇంటి ముందు కూర్చొని ఉండగా పక్కవీధిలోనున్న కోల్లకాని విజయ్ తాగిన మైకంలో ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బత్తలపల్లి: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..బుక్కపట్నం మండలం యాదాలంకపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ కొన్నేళ్ల క్రితం బత్తలపల్లికి వచ్చి స్థిరనివాసం ఉంటున్నారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. కుమారుడు నాగేషు(24) అనంతపురంలో ఏసీ మెకానిక్‌గా పని చేసేవాడు. ఎప్పుడూ ఫోన్‌లో మాట్లాడుతుంటే ఎందుకు రా ఎప్పుడూ ఫోన్‌లో మాట్లాడుతుంటావ్ అని దండించినందుకు ఇంట్లో వారిపై అలిగి బుధవారం రాత్రి అనంతపురం నుంచి వస్తూ యర్రాయపల్లి వద్ద క్రిమి సంహారక మందు తాగాడు. ఇంటికి వచ్చి భోజనం చేస్తుండగా వాంతి చేసుకున్నాడు. అనుమానం వచ్చి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగుళూరుకు తరలించిగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పరామర్శ



ప్యాదిండిలో బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి మాజీ సర్పంచ్ లింగారెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి కడుపునొప్పి తాళలేక పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రాప్తాడు నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని మృతుడి తల్లిదండ్రులు, భార్యను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. మృతికి గల కారణాలను కుటుంబ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సానే రాజారెడ్డి, డోలా రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, ఆదిరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

నల్లమాడ: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం సిబ్బందికి సూచించారు. రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, ఆస్పత్రి నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ల్యాబ్, వ్యాక్సిన్ రూం, వార్డు, మందుల నిల్వను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం యర్రవంకపల్లిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను తనిఖీ చేసి రోగులకు స్వయంగా పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, సీహెచ్‌ఓ రామాంజులు, ఎంపీహెచ్‌ఎస్ మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రోగుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, డాక్టర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మలకవేమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, వ్యాక్సిన్, లేబర్, ఓపీ గదులను పరిశీలించారు. డాక్టర్ నాగేంద్రనాయక్, డాక్టర్ వీటి రోజా, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నల్లచెరువు: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. మండల వైద్యాధికారి కల్పనారెడ్డి, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు, గురువులు

పుట్టపర్తి: బుక్కపట్నం ఉన్నత పాఠశాలలో శనివారం 2000–01 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సమావేశమయ్యారు. దాదాపు పాతికేళ్ల తర్వాత అందరూ ఒకచోట చేరడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. వారు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పటి గురువులు గురువులు రత్నమాల, రామిరెడ్డి, సుధారాణి, ప్రస్తుత ఉపాధ్యాయుడు ఇసాక్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

గోకులం షెడ్ల ప్రారంభం

తనకల్లు: కోటూరు, గోళ్లవారిపల్లిలో నిర్మించిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి నూతన కమిటీని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్‌పీ కుంట: ఎన్‌పీకుంట, వెలిచలమల గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్లను శనివారం అధికారులు ప్రారంభించారు. ఎంపీడీఓ అంజినప్ప, సర్పంచ్ అంజనమ్మ, ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: కుట్లపల్లోల్లపల్లిలో నిర్మించిన గోకులం షెడ్డును ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ శనివారం ప్రారంభించారు. గ్రామంలో సమావేశం నిర్వహించి లబ్ధిదారులతో మాట్లాడారు.